అయిందా యిప్పుడూ—మళ్ళీ తెల్లవారుఝామున యేమిటండీ:—నాకు యీ పదిరోజులనుంచీ నిద్ర బొత్తిగా చాలటంలేదండీ, ఏమండీ, ఆ తెల్లవారుఝాము పాఠాలుకూడా యిప్పుడే చదివెయ్యండీ..." అలాగంది.

తెల్లబోయిన అతని మొహం, లైటు తెలుపులో మరింత తెల్లబడింది.

# అంతా మన మేలుకోసమే

భార్యాభర్తలిద్దరికీ వొళ్లు భగ్గున మండిపోతోంది. పగతీర్చుకోడానికి దారి కనపడదు. ఎలాగయినా పగతీర్చుకోకపోతే, మనసు కుదుట పడేటట్టులేదు.

"ఎలాగ యీ వెధవతోటి; పోలీసుపని చేస్తున్నానని వీడికి మహా యిదిగావుంది. అంత పొగరా!" అంటూ ఆకాశంవొంక చూశాడు నాగయ్య.

"పొగరా. మరీపొగరా. తను పోలీసుపని చేస్తే ఎవరికేం. వాడికన్న ఎక్కువగా, వాడిపెళ్ళాం మరీ మదాయించింది, న్యూసెన్సుకేసు పెట్టిస్తుం దట మనమీద. మంచాలన్నీ నల్లులు పట్టాయని వీధిలో ఎండకు పడవేస్తే ఒకటే గోల. ఈవీధి దాని తాతసొమ్మా. నువ్వు వూరుకుంటూంటే వాళ్లు అలాగే నెత్తెక్కుతారు. అద్దెకున్నవాళ్ళు, వాళ్ళునచ్చి, సొంతయింటివాళ్లం, యీవూరువాళ్ళం మనమీద దబాయింపు సాగిస్తారేమిటి! నువ్వు మాట్లాడ కుండా వూరుకుంటే, నేనువూరుకోను. మొన్న జొన్నలు ఎండలోబెట్టి, సాయంత్రంపూట, దుమ్మా, దూళీవుంటే పోతుందిగదా అని తూర్పార బడితే, ఆ దుమ్మంతా వాళ్ళయింటివేపు వచ్చిందని అతగాడి పెళ్ళాం పోట్లాటకు వచ్చింది. గాలివాలు అటుంటే, దానికి నేనేంజేసేది. ఏదో ఆడవాళ్ల పోట్లాటగదా అని అతగాడు వూరుకోడేం. బడితెలాగ ఎగబడి నాతో పోట్లాడతాడూ! ఏందిది, ఎన్నాళ్ళు మనమట్టా యీ యెదవల్తోటి పోట్లాడుతూ వుంటాం" అని సాధించింది కోటమ్మ.

"వాళ్ళను ఆ యింట్లోంచి వెళ్ళగొట్టమని, యింటిగలాయన కోమటి సుబ్బయ్యను చెప్పివస్తానుండు" అన్నాడు నాగయ్య.

"ఆ కోమటాయన యెందుకు నీమాటింటాడూ! ఆయనకు అసలే పోలీసు లంటే బయ్యం. పైగా, వీళ్ళుపోతే, అద్దిచ్చి యీ యింటోవుండేదెవడూ! ఏదో ఒకవిధంగా మనమే బుద్ధిచెప్పాల" అంది కోటమ్మ.

"ఏం చేస్తే వీడికి బుద్దొస్తుందబ్బా" అని ఆలోచన సాగించాడు నాగయ్య.

భార్యాభర్త లిద్దరూ చాలాసేపు తీవ్రంగా ఆలోచించారు. ఇంటిప్రక్క వున్న పోలీసు కాన్‌స్టబిలు లింగరాజును ఏవిధంగా పంచన చెయ్యాలా అని ఎంత ఆలోచించినా, వారికి ఆలోచన తోచలేదు.

ప్రతి విషయంలోనూ, ఏదో ఒకవిధంగా తమకన్న అధికుడిలాగ ప్రవర్తిస్తున్న లింగరాజు వేషమూ, అతని భార్యవేషమూ యీ దంపతులకు యెంతమాత్రమూ సరిపడడంలేదు. కాకీడ్రస్సు వేసుకొని, ఎర్రటోపీ పెట్టుకొని, యీ పృథివి కంతటికీ అధిపతిలాగ నడుస్తాడు లింగరాజు. ఇహ, అతని భార్యను పట్ట పగ్గాలేలేవు. వీళ్ళని యెలాగయినా లొంగదీసి, తామంటే గౌరముండేటట్టు చేసుకోవాలని, నాగయ్యా, కోటమ్మా అహోరాత్రాలు తపస్సు చేస్తున్నారు.

ఉన్నట్టుండి, హఠాత్తుగా "ఆఁ, మంచి భలే ఉపాయం" అన్నాడు నాగయ్య.

"ఏంజేస్తావేం?" అని అడిగింది కోటమ్మ.

"చెపుతాగా. చెప్పడమెందుకు చేస్తాగా. నువ్వూ చూస్తావుగా. వాడి రోగం దబ్బున కుదురుస్తాగా" అన్నాడు నాగయ్య.

"ఏంజేస్తావో చెపుదూ" అంది కోటమ్మ.

"నువ్వు ఏం మాట్లాడకుండా వూరుకో. రెండురోజుల్లో వాడు కాళ్ళబేరానికి రాకపోతే అప్పుడు నన్నడుగు" అన్నాడు నాగయ్య. కోటమ్మ యెంత బ్రతిమలాడినా తన ఉపాయంయేదో చెప్పాడుకాదు. విసుగుబుట్టి కోటమ్మ ఊరుకుంది.

ఆనాడు రాత్రి, ఊరు కాస్త మాటుమణిగిన తరువాత. నాగయ్య

ఒక్కడూ యింట్లోనుంచి బైటికి వెళ్ళాడు.

"మళ్ళీ కాస్సేపటిలో వస్తాలే" అని చెప్పడంచేత, ఎక్కడికని కోటమ్మ ప్రశ్నలేమీ వెయ్యలేదు.

ఒక అరగంట సేపటలో నాగయ్య తిరిగి వచ్చేశాడు. ఎక్కడికి వెళ్ళావని కోటమ్మ అడిగింది.

"అంతా తరవాత చెపుతాలే. ఇప్పుడు మనం యేం మాట్లాడుకున్నా, మనకీ వాళ్ళకీ మధ్య గోడేగా అడ్డం, అన్నీ కాకపోయినా కొన్ని మాటలైనా వినబడతాయి. మనం చేసేపని వాడికి ముందుగా యేమాత్రం తెలిసినా అంతా పాడైపోతుంది. ఒక్కరోజు నువ్వు ఓపికపట్టు. వాడి రోగం నీకళ్ల యెదుటనే కుదురుతుంది" అని భార్యను సంతృప్తి పరచాడు నాగయ్య.

ఆ మర్నాడు, భార్యా భర్తలు చాలా గుంభనగా నడిచారు. లింగరాజు భార్య, ఒకటి రెండు విషయాలలో తనంత తానే పోట్లాటకు రాబోయినా, కోటమ్మ చాలా హుందాగా, "నీతో నాకు పోట్లాటెందుకూ" అని గొప్పతనాన్ని చూపించింది.

ఆనాడు లింగరాజుతో, పొరుగున రెండుమైళ్లలోవున్న ఒక వూరునుంచి ఒక చిన్నరైతు మాట్లాడడానికి వచ్చాడు. ఆ రైతు రెండు కోడిపెట్టల్ని తీసుకువచ్చి "జవానుగారు, ఒకటి మీరు వుణ్ణిచ్చుకొని, ఒకటి అయ్యగారికి పంపించండి. కాస్త శ్రద్ధపెట్టి మనపని అయేటట్టు చూశారంటే, మనసంగతి తెలుస్తుంది" అనడం, "నేను వస్తాగా, ముందు నేనువచ్చి నీతో మాట్లాడి, అవతలివాళ్లను కదలవేసివచ్చిన తరువాతనే సంగతంతా అయ్యగారికి చెపుదాం" అని జవాబివ్వడం, వీధి గుమ్మంలో చుట్టకాలుస్తూ నిలబడి, నాగయ్య వింటూనే వున్నాడు- పొరుగూరిరైతు తనను 'జవానుగారు' అన్నప్పుడు లింగరాజు సగర్వంగా తనవైపు చూసిన చూపును, అతి కష్టం మీద భరించాడు నాగయ్య.

లింగరాజు లోపలికి వెళ్ళిపోవడమూ, ఆ రైతు తనదారినే వెళ్ళిపోవడమూ, వీధిలో తనతో మాట్లాడేవారు కాని, తను చూడవలసినవికాని

ఏమీ లేనందువల్ల నాగయ్యకూడా ఇంట్లోటికి వెళ్లక తప్పిందికాదు.

ఆనాటి సాయంత్రమే లింగరాజు యెక్కడికో వెళ్ళిపోయాడు. నాగయ్య మాత్రం మామూలు ధోరణిలోనే కొంచెం చీకటి పడగానే భోజనం చేసుకొని, చుట్ట కాల్చుకొని "అట్లా నాగయ్యయింటికిబోయి వస్తా" అని తన పెళ్లానికే కాక, రోడ్డుకికూడా వినపడేటట్లు కేక వేసి వెళ్లాడు.

రాత్రి జామున్నర పొద్దు దాటిపోయింది. చీకటిలో లింగరాజు ఒక్కడూ, పొరుగునవున్న పాలెంనుంచి యింటికి వస్తున్నాడు. వూరు యింకా అరమైలుదూరం వుంది. వూరుదగ్గరకు వచ్చినకొద్దీ, అడుగులు గబగబా వేస్తూ నడుస్తున్నాడతడు.

"ఎవరా పొయ్యేదీ!" అని కేక వినిపించింది.

"నేను పోలీసు లింగరాజును. నువ్వెవ్వరు?" అన్నాడు లింగరాజు.

"మమ్మల్ని ఎరగనండి" అంటూ ముందువచ్చినవాడు ఫెడీల్మని లింగరాజును కొట్టాడు. వాళ్ళిద్దరూ కలియపడ్డారు. మూడోవాడు, తన చేతిలోవున్న గజమున్నర కర్రతోటి, వీలు చిక్కినప్పుడల్లా లింగరాజును ఒక్కొక్క దెబ్బ కొట్టడం ఆరంభించాడు. నాలుగైదు నిమిషాలలో లింగరాజు, ఆ యిద్దరి దెబ్బలకూ తట్టుకోలేక పోవడం, పెద్దగా కేకలు వెయ్యడం జరిగింది. ఆ రెండోవాడు చివరకు, చేతిలోవున్న కర్రతో లింగరాజు నెత్తిమీద బాదాడు. లింగరాజు క్రిందపడ్డాడు ఆ యిద్దరూ పారిపోయారు.

లింగరాజుకి మళ్లీ స్పృహవచ్చేటప్పటికి, పోలీసు స్టేషనులో వున్నాడు. పదిమంది జనం లాంతర్లు పెట్టుకుని తనవంక చూస్తున్నారు. సబిన్‌స్పెక్టరూ, డాక్టరూ యేదో మాట్లాడుకుంటున్నారు. నీరసంతో, ఆ లాంతర్ల వెలుతురు వైపు చూడలేక అతడు కళ్లుమూసుకున్నాడు.

మళ్లీ మర్నాటికి అతనికి తెలివి వచ్చింది.

క్రితంరాత్రి కోమటి వెంకయ్యగారి యింట్లో దొంగలు పడ్డారనీ, నాలుగు వేల రూపాయల సామాను దోచుకొని వాళ్లు పారిపోతుంటే, కొంతమంది వాళ్లని కనుక్కొని వెంబడి పడ్డారనీ, ఊరిబయట తోటదాకా వెళ్లినతరువాత

దొంగలు మాయమయ్యారుకాని, దొంగలచేత దెబ్బలుతిని స్పృహతప్పి పడి వున్న లింగరాజునుమాత్రం వూరుచేర్చారనీ, లింగరాజు భార్య చెప్పింది. లింగరాజు సావధానంగా విన్నాడు. తనను కొట్టినవాళ్లు దొంగలుకాదనీ కేవలం తనకోసమే పొంచునివున్న మరొక దుష్టద్వయమనీ, ఎంచేతనోగాని లింగరాజు బయటపెట్టలేదు.

ఆనాడు డాక్టరువచ్చి, లింగరాజు తలమీద గాయాన్ని తణిఖీచేసి వెళ్ళాడు. పదిరోజులదాకా కదలకూడదన్నాడు.

తాను బీటునుంచి వస్తూవుంటే, ముగ్గురు మనుష్యులు పరుగెత్తుకు తనకు ఎదురుగా వస్తూవున్నారనీ, తాను వారిని అడ్డగించాననీ, వాళ్లు తనతో కలియబడ్డారనీ, తాను చాలాసేపు పోట్లాడాననీ, వారిలో ఒకడు తన నెత్తిమీద కర్రతో గట్టిగా కొట్టాడనీ, తాను స్పృహతప్పి పడిపోయాననీ లింగరాజు, సబిన్‌స్పెక్టరుకు స్టేటుమెంటు ఇచ్చాడు.

సబిన్‌స్పెక్టరు అలాగే డైరీవ్రాసి పంపించాడు.

లింగరాజుకి గాయం పూర్తిగామాని, డ్యూటీకి హాజరవగలిగేటప్పటికి నాలుగువారాలు పట్టింది.

నాగయ్యమాత్రం యెందుచేతనో లింగరాజువంక చూడటం మానేశాడు. అతడు ఎక్కడేనా కనబడ్డా, ప్రక్కకు తప్పుకొని వెళ్ళిపోయాడు.

ఓరోజున నాగయ్య వీధిగుమ్మంలో నిలుచునివుండగా, లింగరాజు తన ఇంట్లోనుంచి బైటికివచ్చి "ఏం నాగయ్యా, నేను యీ వూరినుంచి వెళ్ళిపోతున్నా" అన్నాడు.

నాగయ్య ఏమీ మాట్లాడలేదు.

"ముగ్గురు దొంగల్ని యెదిరించి, వాళ్లని పట్టుకోడానికి ప్రయత్నించినందుకు, నాకు హెడ్‌కాన్‌స్టబిల్ పని యిచ్చారు" అన్నాడు లింగరాజు.

నాగయ్య కొంచెంసేపు వూరుకుని, "నాచేత తన్నులు తిన్నవాడికి హెడ్డుకనిస్టేబిలు పని అవుతుందన్నమాట" అన్నాడు.

లింగరాజు ఇంట్లోకి వెళ్లిపోయాడు. (ఒక ఇంగ్లీషు కథను అనుసరించి)

# చలిజ్వరం

వెంకటరావూ, రామమూర్తీ దెబ్బలాడుకున్నారనీ, వెంకటరావు, రామమూర్తిని దిట్టంగాబాది వదలి పెట్టాడనీ నాకు ఆనోటా, ఆనోటా తెలిసింది. ఎవరూ సరిఅయిన వర్తమానం మాత్రము చెప్పలేదు. వెంకటరావు చాలా మంచిమనిషి; సాధారణంగా. యెవరినీ మనసు నొప్పించేవాడు కాడు. అలాటివాడు రామమూర్తిమీద చెయ్యిచేసుకున్నాడంటే, నాకు ఆశ్చర్యం కలగకపోలేదు.

ఇక, రామమూర్తి వొట్టినాప. ఒకరికి కోపము తెప్పించేటంత సమర్థతా, తెలివి తేటలూకూడా అతడికిలేవు.

ఒకటి పాలు, ఒకటి నీళ్ళు. ఈ రెండిటి మధ్యనూ అగ్నిహోత్రము ప్రజ్వరిల్లింది.

దెబ్బలుకొట్టిన వెంకటరావుని, 'ఏమిట్రా, ఆ పిచ్చి వెధవమీద చెయ్యి చేసుకున్నావుటా?' అని అడిగాను.

"ఇంకానయం, బ్రతికిపోయాడు వెధవ. నిలువునా చీల్చి యెండ వేసేవాడిని, పోగరుబోతు గాడిదకొడుకు" అంటూ మళ్ళీ రుద్రావతార ఘట్టము లోకి దిగాడు.

ఏదో తీవ్రమైన కారణంలేనిదే, వెంకటరావు కళ్లు అలా నిప్పులు రాలుస్తాయా! కాని, అంతకోపము తెప్పించేటంత అపరాధము, ఆ పిచ్చి రామ్మూర్తి యేమి చేసివుంటాడు?

ఎంతసేపు, ఎన్నివిధాల ప్రశ్నించినా వెంకటరావు రామ్మూర్తి మళ్లీ కనపడితే, ప్రేగులుత్రెంపి మెళ్ళో వేసుకుంటాననడమేకాని, అంత ప్రళయ తాండవానికి హేతువేమిటో చెప్పాడుకాడు.

ఇక రామ్మూర్తిని అడిగితే—వాడూ యింతే; ఎంతసేపూ, 'దుష్టువెధవ, దుష్టువెధవ, రౌరవాదినరకాలకిపోతాడు. పాపిష్టివెధవ,' అనడముతప్ప, అసలు కథకి సూచన మాత్రమైన అందింపుకూడా యిచ్చాడుకాడు.